సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, మే 31 (నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్: రాబోయే వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య, ఆరోగ్య, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే వానకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 7 నాటికి ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు వారీగా నీరు నిల్వ ఉండే ప్రాంతాల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో డ్రై డే కార్యక్రమంలో భాగంగా వాటర్ లాగిన్ పాయింట్ల మరమ్మతు కోసం ఉపాధిహామీ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యాంటి లార్వా స్ప్రేచేయాలని, డ్రైయిన్లను డీసెల్టింగ్ పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాలతో ఆయిల్‌బాల్ తయారీ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మానేరు, మూలవాగుల ప్రవాహాలకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ రాపిడ్ టెస్టులు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కూలిపోయే స్థితిలో, పాతబడిన భవనాలను తొలగించాలని ఆదేశించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు, కట్టడాలను తొలగించాలని సూచించారు. సమావేశంలో జడ్పీసీఈవో ఉమారాణి, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అవినాష్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగకూడదన్న బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేములవాడ ఆలయంతోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, థియేటర్లు, జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో జూన్ 15నాటికి బోర్డుల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. జూన్ నెలాఖరులోగా ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో పొగాకు వాడకంతో కలిగే నష్టాలపై వివరిస్తూ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, అవగాహన కార్యక్రమాలతో కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. పొగా కు తాగే అలవాటున్న వ్యక్తులను మాన్పించేందుకు డీ అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డీఈవో రమేశ్‌కుమార్, డీపీఆర్వో శ్రీధర్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్: కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 31: క్రీడా నైపుణ్యాలు మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో ఈ నెల 5 నుంచి7వరకు జరిగే ఇంటర్నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆయన శుక్రవారం అభినందించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో యువత సామాజిక మాధ్యమాల వైపు ఆకర్షితులై కనీస వ్యాయామానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ అథ్లెట్స్ అంతర్జాతీయ క్రీడల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని వారిని ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ కార్యదర్శి జీ శేఖర్, జాయింట్ సెక్రటరీ చింతలపల్లి మునీందర్‌రెడ్డి, పెద్దపల్లి కార్యదర్శి కే మహేందర్‌రెడ్డి, అథ్లెట్స్ కమఠం రామానుజమ్మ, నాయిని శంకర్, అబ్దుల్ పఠాన్, లక్ష్మణ్, కమల్, జవ్వాజి లక్ష్మణ్, మేనేజర్ గడ్డం సత్యనారాయణరెడ్డి, నాయకులు కనికరపు రాకేశ్, అన్నారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

వేములవాడ రూరల్, మే 31: వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో లయ యూత్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మరణించిన క్రీడాకారుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఇక్కడ జిల్లా వాలీబాల్ అసోసియన్ కార్యదర్శి శ్రీకుమార్, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, నాయకులు బాల్‌రెడ్డి, తిరుపతి, మల్లారెడ్డి, సంఘ స్వామి, ముకుందరెడ్డి, మల్లేశం, అనిల్, శ్రీనివాస్, లయ యూత్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

వృత్తిదారులను అర్థం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మే 31: తరతరాల నుంచి కుల వృత్తిని గ్రామస్తుల నమ్మకాలు, విశ్వాసాల మేరు చేస్తున్నామని తమను వృత్తిదారులుగా గుర్తించాలని బైండ్ల సంఘం నాయకులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. శుక్రవారం వెంకటాపూర్ నేతలు మండల కేంద్రంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. పూజల పేరిట దోపిడీ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, నమ్మకంతో వచ్చే భక్తులకు లాభాపేక్ష లేకుండా సేవచేసే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

అంకితభావంతో సేవచేస్తే గుర్తింపు

వేములవాడ: డీపీవో దంపతులను సత్కరిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్లు

వేములవాడ టౌన్: ఉద్యోగ విరమణ పొందిన శేఖర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జి ఈవో రామకృష్ణ

వేములవాడ, మే 31: ప్రజలకు అంకిత భావంతో సేవ చేస్తే చిరకాలం గుర్తింపు ఉంటుందని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. వేములవాడ ఆర్డీవో కార్యాలయ డీపీవో ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యాలయ ఆవరణలో గణేశ్-అరుణ దంపతులను ఆయన శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇక్కడ తహసీల్దార్లు మహేశ్‌కుమార్, శ్రీనివాస్, విజయ్‌ప్రకాశ్, సుజాత, శ్రీలత, పుష్పలత, ఫారూఖ్, సిబ్బంది ఉన్నారు.

వేములవాడ టౌన్, మే 31: రాజన్న ఆలయంలో 35ఏండ్లుగా ఎలక్ట్రిషన్ విధులు నిర్వర్తిస్తున్న ఏఈ ద్వారక శేఖర్ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈవో కార్యాలయంలో ఈవో రామకృష్ణ శేఖర్ కుటుంబ సభ్యులను సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంకెపల్లి హరికిషన్, గౌరవాధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, ఈఈ రాజేశ్, ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకుడు వరి నర్సయ్య, కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు నమిలకొండ రాజేశ్వర శర్మ, అర్చకులు శేఖర్‌ను సత్కరించారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికల బరిలో నిలిచింది వీరే

రాజన్న సిరిసిల్ల, మే31(నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 61మంది ఎన్నికల బరిలో నిలిచారు. 39మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. ఒకటో డివిజన్‌లో 9 మంది అభ్యర్థులు అరుకల ఆనందం, గజ్జెల్లి సత్యనారాయణ, గుడ్ల వెంకటేశం, నల్ల ప్రదీప్‌కుమార్, పత్తిపాక పద్మ, బూర్ల వెంకటేశం, బొల్లి రవీందర్, యేముల మురళీ, రాపెల్లి లక్ష్మీనారాయణ పోటీ పడుతున్నారు. 2వ డివిజన్‌లో గుడ్ల సత్యానందం, బోగ శంకర్, స్వర్గం శేఖర్, 3వ డివిజన్‌లో చొప్పదండి ప్రమోద్, బొద్దుల భాస్కర్, 4వ డివిజన్ నుంచి అడ్డగట్ల మురళీ, యేముల హన్మంతు, సూరం వినయ్, 5వ డివిజన్ నుంచి తుంగ శివరాజ్, పాటి కుమార్‌రాజు, బానోత్ నీల, మొగిలి రాజు, 6వ డివిజన్ నుంచి ఆడెపు చక్రపాణి, కందికట్ల సదానందం, బుర్ర రాజు, మర్రిపెల్లి శశికాంత్, మ్యాన రాంప్రసాద్, వంగరి అంబదాస్, 7వ డివిజన్ నుంచి ప్రయాకరావు వినీల, బుర్ర జ్యోతి, వేముల సుక్కమ్మ, 8వ డివిజన్‌లో అడ్డగట్ల దేవదాస్, అవదూత నాగరాజు, కూస లక్ష్మీనారాయణ, గొరిట్యాల ప్రకాశ్, గంగుల రాజేందర్, రాపెల్లి శ్రీహరి, స్వర్గం రాజు, 9వ డివిజన్‌లో ఆడెపు జగదీశ్వరి, ఎనగందుల శంకర్, గాలిపల్లి ప్రకాశ్, చొప్పదండి శ్రీనివా స్, నేరెళ్ల ప్రేమ్‌కుమార్, సోమిశెట్టి దశరథం, 10వ డివిజన్‌లో ఆడెపు అనసూర్య, ఏలూరు కవిత, చీటి గీత, మచ్చ లలిత, మామిడాల లత, వలుస హరిణి, 11వ డివిజన్‌లో ఉల్చె శ్రీనివాస్, కట్ల సతీశ్, కొండి సదానందం, పత్తిపాక సురేశ్, యెర్రగుంట కపిల్, 12డివిజన్‌లో అడిగొప్పుల పరమేశ్, ఆడెపు సూర్య, కూస మహేశ్, కోడం సంజీవ్, గుడ్ల సురేశ్‌కుమార్, బూర్ల విద్యాసాగర్, మామిడాల రమణ ఎన్నికల బరిలో నిలిచారు.

క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వేసవి ఉచిత శిక్షణ శిబిరం ముగింపు వేడుకకు హాజరు

శిక్షణ పొందిన చిన్నారికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, మే 31 (నమస్తే తెలంగాణ): పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పిలుపునిచ్చారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు విద్యార్థులకు ఉచితంగా వేసవి శిక్షణ తరగతుల శిబిరం నిర్వహించారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు వద్ద ముగింపు కార్యక్రమంలో 300మంది శిక్షణ పొందిన చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని యువత చెడు మార్గాల వైపు దారిమళ్లకుండా ఉండేందుకు గానూ జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. యోగా, కరాటే, వాలీబాల్, కబడ్డీ, ఆర్ట్స్, అర్చరీ వంటి అంశాల్లో శిక్షణ తరగతుల ద్వారా మెరుగైన శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. నిజ జీవితంలో సమష్టి కృషితోనే విజయాలను సులువుగా చేరుకోగలమన్నారు. ఉన్నత విజయాలను చేరుకోడానికి కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఇక్కడ ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రాచారి, సీఐలు రఘుపతి, వీరప్రతాప్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు ఉన్నారు.

రికార్డుల పరిశీలన

బోయినపల్లి, మే 31: మండల పరిషత్ కార్యాలయంలోని పలు రికార్డులను జడ్పీ సీఈవో ఉమారాణి శుక్రవారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఆమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలలు పునర్‌ప్రారంభమయ్యేలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక్కడ జడ్పీ డిప్యూటీ సీఈవో మచ్చ గీత, ఎంపీడీవో జయశీల, సీనియర్ అసిస్టెంట్ ఆరీఫ్, తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

ఇల్లంతకుంట, మే 31: క్రీడాకారులకు అన్నివిధాలా అండగా ఉంటామని కరీంనగర్‌లోని రాఘవేంద్ర దవాఖాన డాక్టర్ గాజర్ల శరత్, మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో వేసవి క్రీడా శిబిరంలో శిక్షణ పొందుతున్న 80మంది క్రీడాకారులకు ₹35వేల విలువైన టీ షర్టులను శుక్రవారం వారు అందించారు. ఇక్కడ పీఈటీలు సాన బాబు, మామిడి శ్రీనివాస్, కర్ల నరేశ్, స్పోర్ట్స్ క్లబ్ నిర్వాహకులు మామిడి రాజు, దుర్శేటి బాలయ్య, మామిడి సంజీవ్, దాసరి శివరామ్, కీసరి బాబు, ఒగ్గు మధు, మోజెస్, అరవింద్, విక్కి, నిఖిల్, సన్ని, ప్రవీణ్, పవన్, భాషా, రఘు, నవీన్ ఉన్నారు.

ఆస్తి పన్నులు వసూలు చేయాలి

- డీపీవో వీరబుచ్చయ్య

వీర్నపల్లి, మే 31: వందశాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయితీ అధికారి వీరబుచ్చయ్య అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, నర్సరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమావేశమైయ్యారు. గ్రామ పంచాయితీ కార్మికుల జీతాలు, వసూలు చేయాల్సిన ఇంటి పన్నులు, అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించాలన్నారు. జూలై 31లోగా పన్నులు వసూలు చేయాలన్నారు. నర్సరీలు, ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. వేసవి పూర్తయ్యే వరకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు. ఇక్కడ ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో నరేశ్‌కుమార్ ఉన్నారు.

ద్వైమాసిక పత్రికావిష్కరణ

సిరిసిల్ల టౌన్, మే 31: సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన ద్వైమాసిక పత్రికను శుక్రవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఆస్తిలో కొంత భాగం తమ పేరిట చేసుకుని మిగతాది పిల్లల పేరిట చేయాలని సూచించారు. ఇక్కడ సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327724-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడలో పలు ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

వేములవాడ: శ్రీలక్ష్మి ఎరువులు, విత్తనాల షాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

వేములవాడ, మే 31: జిల్లాలోని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్, శ్రీలక్ష్మి ఎరువుల విత్తనాలు దుకాణాలను తనిఖీ చేశారు. విక్రయాల నిర్వహణ రిజిస్టర్, స్టాక్ వివరాలు పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో అవసరమైన మేర ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తు గానే స్టాక్ పెట్టుకుని రైతులకు సమస్యల్లేకుండా చూడాలన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ఎరువుల కొరత కూడా రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మినట్లు తెలిస్తే పీడీయాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఈఏ అధికారి భాస్కర్, ఏవో సాయికిరణ్ ఉన్నారు.

విత్తన ఎంపికనే ప్రధానం

ఇల్లంతకుంట/ముస్తాబాద్, మే 31: పంటల సాగులో విత్తన ఎంపికే ప్రధానమని ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాల ఏవోలు సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు కేశన్నపల్లి, ఆరెపల్లి, తాళ్లపల్లి గ్రామాలలో రైతులకు విత్తనాల ఎంపికపై ఏవో అవగాహన కల్పించారు. ఇక్కడ ఏఈవోలు గంగ, రవళి, జీపీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, రైతులు ఉన్నారు. అలాగే ముస్తాబాద్ మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఫర్టిలైజర్ షాపులను ఏవో వెంకటేశ్ తనిఖీ చేశారు. దుకాణంలో స్టాక్ రిజిస్టర్లతోపాటు రైతులకు ఇస్తున్న రసీదు బుక్‌లకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

ఎములాడ.. కాషాయమయం

రాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- రాజన్న సన్నిధిలో హనుమాన్ భక్తులు
- ఆలయంలో ప్రత్యేక పూజలు

వేములవాడ టౌన్, మే 31: శనివారం పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం దీక్షాపరులతో రద్దీగా కనిపించింది. రాజన్నను దర్శించుకున్న తర్వాత కొండగట్టు అంజన్న క్షేత్రానికి వెళ్లడం ఇక్కడికి వచ్చే భక్తుల ఆచారం. ఈ క్రమంలో భక్తులు అధిక సంఖ్యలో రాజన్న సన్నిధికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. హనుమాన్ నామస్మరణతో రాజన్న ఆలయం మార్మోగింది. ధర్మగుండంలో నీరు వాసన వస్తున్నదని.. కనీసం ఆధునీకరణపై అధికారులు దృష్టిసారించడం లేదని పలువురు హనుమాన్ భక్తులు వాపోయా రు. అలాగే క్యూలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ లేక ఇబ్బందిపడ్డారు. స్వామివారిని దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రాజన్నను సుమారు 15వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు రూ.16లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కాగా, స్వామి వారిని తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పీ విద్యాసాగర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు

మాట్లాడుతున్న కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు

సిరిసిల్ల రూరల్, మే 31: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు సూచించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని బాబూ జగ్జీవన్‌రామ్ వ్యవసా య కళాశాలలో శుక్రవారం కళాశాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేశ్వర్‌రావు హాజరై, మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని, ధైర్యంగా ముందుకుసాగాలని సూచించారు. ప్రస్తుతం కరీంనగర్ డెయిరీ రాష్ట్రంలో నంబర్‌వన్ స్థాయిలో ఉందన్నారు. డెయిరీ రైతులకు అన్ని రకాల ఆర్థిక సాయం అందిస్తూ, పశువులకు అంబులెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. 65ఏండ్లు పైబడిన రైతులకు పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ మాట్లాడుతూ, చల్మెడ రాజేశ్వర్‌రావును ఆదర్శంగా తీసుకొని ఎదగాలన్నారు. విద్యార్థులు వ్యవసాయంలో సాంకేతికత ఉపయోగించుకుని సవాళ్లను అధిగమించాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి కళాశాల విషయాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ చిరంజీవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండూరిని కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 31: సహకార సంఘ బలోపేతానికి ఎనలేని కృషిచేసి టెస్కాబ్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన కొండూరి రవీందర్‌రావును మండల నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. రైతుల పక్షాన పోరాటం చేయడంలో ముందుంటానని రవీందర్‌రావు చెప్పారు. ఇక్కడ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అందె సుభాష్, కొండ రమేశ్‌గౌడ్ ఉన్నారు.



హైదరాబాద్‌లో కొండూరి రవీందర్‌రావుతో నాయకులు

బీడీ కార్మికులకు వేతన పెంపు

ముస్తాబాద్, మే 31: బీడీ పరిశ్రమలో కార్మికులు, ఉద్యోగులు, ప్యాకర్ల వేతన పెంపుపై కార్మిక సంఘాలు, యాజమాన్య సంఘాలకు మధ్య జరిగిన చర్చలు సఫలీకృతమైనట్లు రాష్ట్ర బీడీ కార్మిక సం ఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదిగొండ నారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆయన మండల కేంద్రంలో వెల్లడించారు. ప్రస్తుతం వెయ్యి బీడీలు చుడితే రూ.245. 08 అందుతుండగా. అదనంగా రూ.4.25 పెంచినట్లు తెలిపారు. బీడీ ప్యాకర్లు ప్రస్తుతం పొందుతున్న వేతనాలపై నెలకు అదనంగా రూ.3,650 ఇవ్వనున్నదన్నారు. టేకేదార్ కమీషన్ వెయ్యి బీడీలకు రూ.4.50పెంచారని తెలిపారు.

ఆర్ఎస్ఐ వేణుగోపాల్ సేవలు ఆదర్శం

సిరిసిల్ల రూరల్, మే 31: 42ఏండ్లు విధులు నిర్వర్తించిన ఆర్ఎస్ఐ వేణుగోపాల్ సేవలు ఆదర్శనీయమని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ వేణుగోపాల్-శాంతకుమారి దంపతులను శుక్రవారం కమాండెంట్ ఘనంగా సన్మానించారు. ఇక్కడ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీరాందాస్, బెటాలియన్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

పట్టా భూమి మట్టికి ఇబ్బందులెందుకు..

- రెండు నెలలైనా ఎన్‌వోసీ ఇవ్వని వైనం

ఎల్లారెడ్డిపేట, మే 31: పట్టా భూమి నుంచి మట్టిని తీసుకునేందుకు రైతుల నుంచి అనుమతి ఉన్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓ టిప్పర్ యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటాపూర్‌కు చెందిన మామిండ్ల జగన్ అనే టిప్పర్ యజమాని కొంత కాలంగా చట్టానికి లోబడి పట్టా భూమి రైతులతో మాట్లాడుకుని మట్టిని అవసరం ఉన్న వారికి విక్రయిస్తున్నాడు. కొందరు రైతులు తమ భూమిని అభివృద్ధి చేసే క్రమంలో చదును చేయించుకుంటారని, సదరు మట్టిని అవసరమైన స్థానిక రైతులు, మండల పరిధి ప్రజలకే విక్రయిస్తామన్నారు. ప్రస్తుత సీజన్‌లో భూమి అభివృద్ధి పనులు, చిన్న మడులను పెద్దగా చేయించుకోవడం, పంట పొలాల్లోని గుంతలు పూడ్చడం, తెగిన మడ్లను సరి చేసుకోవడం, నూతన గృహాల బేస్‌మింట్ నింపే పనులు చేస్తుంటారు. మట్టిని తరలించేందుకు రైతులు అభ్యంతరం చెప్పనప్పటికీ ఎన్‌వోసీ ఇవ్వడం లేదన్నారు. తహసీల్దార్ వద్ద అనుమతి తీసుకుని మట్టిని తరలించే క్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తన టిప్పర్‌ను తహసీల్ కార్యాలయంలో ఉంచారని ఆరోపించారు. ఈ విషయమై డీటీని ఫోన్ ద్వారా వివరణ కోరగా, స్పందించలేదని తెలిపారు.

సిన్నసార్లు కనిపిస్తలేరా అని అన్నడు: యజమాని జగన్

తహసీల్దార్ రామచంద్రం సర్ అనుమతితో మట్టిని కొట్టుకుంటే డీటీ సర్ నా వాహనాన్ని తీసుకుపోయి ఆఫీసల పెట్టించిండు. డీటీ దగ్గరకు పొయి సర్ నా వెహికిల్ ఎందుకు తీసుకువచ్చిన్రు.. నేను పర్మిషన్‌తోటే మట్టిని తీస్తున్న అని మొర పెట్టుకుంటే పెద్ద సార్లే కన వద్దరా.. సిన్నసార్లను కలువరా అంటూ ఇబ్బందిపెట్టాడు. నేను లీగల్‌గా మట్టిని తీసేందుకు పర్మిషన్ కోసం మైనింగ్ సార్లతో మొర పెట్టుకుంటే ఎన్‌వోసీ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఆఫీస్‌కు లెటర్ పంపారు. మట్టి తీయించుకునే రైతుల నుంచి అభ్యంతరం లేకున్నా ఎన్వోసీ ఇవ్వడం లేదని జగన్ వాపోయారు.

యువతి ఆత్మహత్యపై నిరసన



మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న గిరిజనులు

ఎల్లారెడ్డిపేట, మే 31: వీర్నపల్లి మండలం బాబాయి చెరువు తండాకు చెందిన బానోత్ మమత గురువారం ఆత్మహత్య చేసుకోగా, ఇందుకు బాధ్యుడైన గుగులోత్ సతీశ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తండావాసులు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంసభ్యులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. పోస్టుమార్టం అనంతరం సిరిసిల్ల నుంచి బాబాయిచెరువుతండా వరకు పోలీసుల బందోబస్తు మధ్య మమత మృతదేహన్ని తరలించారు. రాత్రి 8గంటలకు అంత్యక్రియలు జరిపించారు. పరిస్థితిని డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సమీక్షించారు. ఇక్కడ సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

చందుర్తి,మే31: లింగంపేట శివారులో వ్యవసాయ భూమిని చదును చేస్తున్న రైతు కమటం లక్ష్మీరాజంను వేములవాడకు చెందిన కొలగాని చందు, ఖమ్మం రమాకాంత్ రూ.40వేలు ఇవ్వాలని బెదిరించారు. ఈ మేరకు బాధితుడు లక్ష్మీరాజం ఠాణాలో ఫిర్యాదు చేయగా, శుక్రవారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.